క్లుప్తంగా

పీఎస్సార్‌ను కలిసిన గిరిజన సహకార చైర్మన్



పీఎస్సార్‌కు స్వీట్ తినిపిస్తున్న తిరుపతి

దండేపల్లి: రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్‌గా నియామకమై, ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన దండేపల్లి మండలం అల్లీపూర్‌కు చెందిన కోట్నాక తిరుపతి ఆదివారం ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావును మంచిర్యాలలో మర్యాద పూర్వకంగా కలిశారు. తన ఎదుగుదలకు కృషి చేసిన పీఎస్సార్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానని తిరుపతి పేర్కొన్నారు.

'గాన కోకిల'కు సన్మానం



మురళిని సన్మానిస్తున్న గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ గ్రామానికి చెందిన గాయకుడు, నటుడు ముల్కల్ల మురళికి తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఇటీవలే 'ఉద్యమ గాన కోకిల' పురస్కారాన్ని అందించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శాలువాలతో ఘనంగా సత్కరించారు. మున్ముందు మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

ముగిసిన ప్రవచనాలు



భాస్కర శర్మ దంపతులను సన్మానిస్తూ...

మంచిర్యాలఅర్బన్: స్థానిక గోదావరి నదీ తీరాన గౌతయమశ్వర ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీమత్ భాగవత సప్తాహ ప్రవచన మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా రుక్మిణీ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ప్రవచకులు శతాధిక భాగవత ప్రవచన కర్త ఉబ్బర్రా భాస్కర శర్మ భాగవతంను కులంకుశంగా భక్తులకు బోధించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు శ్రీదేవి, శ్రీనివాస్, వంశీకృష్ణ, రాజేంద్రప్రసాద్, నారాయణ, హరీష్, రాజేశం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరం ప్రారంభిస్తున్న జీఎం మనోహర్

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామంలో సింగరేణి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మందమర్రి ఏరియా జీఎం మనోహర్ రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి డీవైసీఎంవో ఉషాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్యంపై సింగరేణికి ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. వర్షాకాలం గ్రామాల్లో వాతావరణ మార్పు వల్ల వ్యాదులు ప్రబలే అవకాశం ఉంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగరేణి వైద్యులు శ్రీధర్, జయవాణి, వైద్య సిబ్బంది, అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రామకృష్ణాపూర్: పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో ఆదివారం మంచిర్యాలకు చెందిన మ్యాక్స్‌కేర్, రాఘవేంద్ర పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణ ఎస్సై రాజశేఖర్ శిబిరాన్ని ప్రారంభించారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన కమిటీలు

దండేపల్లి: ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కమిటీలు గ్రామగ్రామాన వేస్తున్నట్లు, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మధు తెలిపారు. దండేపల్లిలో ఆదివారం సంఘ సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా రాజేష్, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, కార్యదర్శులుగా సాయికుమార్, చరణ్, ప్రశాంత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ రాజలింగం, కో కన్వీనర్ రవికుమార్, మాజీ ఎంపీటీసీ నవీన్, బీసీ సంఘం నాయకుడు .మహేష్, నేతకానీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేంసాగర్ , నాయకులు. వినయ్, దినేష్, నవీన్ .సుమన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పోచమ్మ



దండేపల్లి: కొత్తమామిడిపల్లిలో పోచమ్మ బోనాలు..



జన్మభూమినగర్‌లో బోనాల జాతరలో పోతురాజులు

దీవించమ్మా.. పోచమ్మ తల్లీ..!

- వైభవంగా బోనాల ఊరేగింపు
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు

మంచిర్యాలఅర్బన్: ఆషాఢమాసంను పురస్కరించుకుని ఆదివారం జన్మభూమినగర్ నివాసితుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు వైభవంగా జరిగింది. స్థానిక బస్టాండ్ సమీపం నుంచి మొదలైన బోనాల జాతర పురవీధుల మీదుగా రామునిచెరువు పోచమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య పోతరాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పసుపు కుంకుమ అలంకరణతో బోనాలను తలపై పెట్టుకుని మహిళలు ముందుకు సాగారు. అనంతరం పోచమ్మకు బోనాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ ఉప్పలయ్య, కౌన్సిలర్లు ముఖేష్‌గౌడ్, చైతన్యసత్యపాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, సంక్షేమ సంఘం సభ్యులు మన్మదరెడ్డి, విజయ్‌కుమార్, మల్లారెడ్డి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

భోనమో పోచమ్మా!

దండేపల్లి: మండలంలోని కొత్తమామిడిపల్లిలో పోచమ్మ భోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో భోనాలు వండుకుని, నెత్తిన ఎత్తుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లారు. పోచమ్మకు భోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

పోచమ్మకు మొక్కులు

భీమిని: భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో వాడపోచమ్మకు ఆదివారం భక్తులు మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సల్లంగ చూడు తల్లి అంటూ వేడుకున్నారు.

ఘనంగా అమ్మవార్లకు బోనాలు

జన్నారం: మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. గ్రామాల్లోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్ల, నృత్యాలతో బోనాలను అమ్మవారి వద్దకు తీసుకువెళ్లి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లికి, కవ్వాల్‌లోని గ్రామస్తులు కట్ట మైసమ్మ తల్లికి, రజకులు మడేలయ్యకు బోనాలతో ఊరేగి మొక్కులు తీర్చుకున్నారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలు, పులి వేషధారణ విన్యాసాలు, డప్పు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కవ్వాల్ గ్రామంలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో వర్షాలు కురువాలని మైసమ్మ తల్లికి పూజలు చేశారు.

వర్షాలు కురవాలని మొక్కులు

తాండూర్: వర్షాల కోసం తాండూర్ మండల రైతులు ఆదివారం గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు. గ్రామాల వారీగా మేకలు, కోళ్లను బలిచ్చారు. ఏటా మాదిరిగానే మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలోనూ పస్క నైవేద్యాలు, సైట్ పిల్లలు, పోశమ్మ తల్లికి మొక్కారు. భక్తి ప్రపత్తులతో గ్రామ పొలిమేరల్లో ఉన్న గ్రామ దేవతల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి పిల్లాపాపలను సల్లంగా చూడాలని వేడుకున్నారు. ప్రత్యేకించి మాదారం రైతులు గొంతెమ్మ గుట్టకు వెళ్లి అమ్మకు పూజలు చేశారు. ఈ సారి వర్షాలు సంవృద్ధిగా కురిపించాలని వేడుకున్నారు.



బోనాల జాతరలో బోనాలతో మహిళలు



మేకతో పూజలు చేస్తున్న గ్రామీణులు



భీమిని: పోచమ్మ వద్ద భక్తులు



జన్నారం: బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఆషాఢం మొక్కులు.. చెట్ల తీర్థాలు



గుడిపేట శివారులో సామూహిక వనభోజనాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆషాఢ మాసం వచ్చిందంటే అందరూ బాగుండాలని కోరుతూ పోచమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తారు. ఇదే సమయంలో గ్రామస్తులు చెట్ల తీర్థాల పేరుతో శివారులోని పోచమ్మతల్లికి మొక్కులు చెల్లించి చెట్ల కింద వంటావార్పు చేసి అంతా కలిసి సామూహిక భోజనాలు ఆరగిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం హాజీపూర్ మండలంలోని గుడిపేట-నంనూర్, నర్సింగాపూర్, దొనబండ, టీకానపల్లి తదితర గ్రామాల శివారుల్లో ఎక్కడ చూసినా స్థానిక గ్రామస్తులు చెట్ల తీర్థాలకు వెళ్లడం, మొక్కులు చెల్లించి అక్కడ వంటలు చేసుకుని సామూహిక మొక్కులు చెల్లించడం, అనంతరం సామూహికంగా వనభోజనాలు చేయడం కనిపించింది. జాతీయ రహదారిపై ఉన్న ప్రతీ దారి మైసమ్మ ఆలయాల వద్ద వాహన దారులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి ఆదివారం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వాడల్లోని కాలువల్లో పూడిక లేకుండా చూసుకోవాలని తెలిపారు. కాలువల్లో, పాడైన వస్తువుల్లో నిలువ ఉన్న నీటి ద్వారా దోమలు చేరి వ్యాదులు ప్రబలే ఆస్కారముందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాడల్లోని కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రే చేశారు. మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో ఘనంగా పీరీల ఊరేగింపు



నెన్నెలలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



జైపూర్‌లో పీరీలతో ఊరేగింపు

నెన్నెల: మొహర్రం పండుగను పురస్కరించుకొని మండలంలోని నెన్నెల, నందులపల్లి, మైలారం, ఆవుడం గ్రామాల్లో 7వ రోజైన చిన్నసర్గత్ వేడుకను ఆదివారం మతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు మొక్కులు చెల్లించుకున్నారు. సవారి బంగ్లాలలో(ఆషూర్‌ఖానా)లో ప్రతిష్ఠించిన పీరీలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్ని గుండం(అలావా) ఏర్పాటు చేసి దాని చుట్టు ఆడిపాడారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు పీరీలకు పూలదండలతో పాటు కుడకలను వేసి మలీద ముద్దలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు పూలు, సబ్జాతో అలంకరించిన కొత్త కుండల్లో బెల్లంతో చేసిన పానకం (షర్బత్)ను సవారీల వద్ద పంపిణీ చేశారు. రాత్రి పీరీలను ఎత్తుకొని అగ్నిగుండం చుట్టు తిరుగుతూ మండే నిప్పుల నుంచి అటు ఇటు దాటి భక్తిని చాటుకున్నారు. ఈ నెల 16న పెద్ద సర్గత్ వేడుకలను ,17న మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించి అదే రోజు సాయంత్రం పీరీలను గ్రామంలో ఊరేగింపు చేసి కుమ్మరివాగులో నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జైపూర్‌లో పీరీల సందడి

జైపూర్: మండల కేంద్రంలో ఆదివారం పీరీల సందడి నెలకొంది. మొహర్రం పండుగ సందర్భంగా పీరీల దేవుళ్లను గ్రామాల్లో ఊరేగింపు చేపట్టగా ప్రజలకు మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం పండుగను పురస్కరించుకుని మిట్టపల్లి, టేకుమట్ల గ్రామాల్లో ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించనున్నారు.

ఆటోయూనియన్ కమిటీల ఎన్నిక



కోటపల్లి ఆటో యూనియన్ సభ్యులు

కోటపల్లి: కోటపల్లి ఆటో యూనియన్ మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బండి రమేశ్ ఎన్నికకాగా ఉపాధ్యక్షుడిగా సాయి, ట్రెజరీగా లక్ష్మణ్, జనరల్ సెక్రటరీగా బాపు, మెంబర్స్‌గా ప్రేమ్, గౌస్, సురేందర్, రమేశ్, సుల్తాన్ ఎన్నికైనట్లు యూనియన్ నాయకులు తెలిపారు. నూతనంగా అటోయూనియన్ సభ్యులుగా ఎన్నికైన వారికి డ్రైవర్లు శుభాకాంక్షలు తెలిపారు.

మందమర్రి ఆటో డ్రైవర్స్ సంఘం అధ్యక్షుడిగా రాంబాబు



మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో ఆదివారం జరిగిన ఆటో డ్రైవర్స్, ఓనర్స్ సంఘం అధ్యక్షుడి ఎన్నికలో మొయ్య రాంబాబు ప్రత్యర్థి అభ్యర్థిపై 66 ఓట్ల మెజారిటీతో గెలిచారు. మొత్తం 307ఓటర్లుండగా 288మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. రాంబాబుకు 177ఓట్లు రాగా ప్రత్యర్థి రాజుకు 111 ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి రాంబాబుకు ఎన్నికల్లో గెలి చిన పత్రాన్ని అందించి అభినందించారు.

అటెన్షన్ ప్లీజ్.. జాతీయ రహదారిపై నిలుస్తున్న నీళ్లు



భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారిపై పోలంపల్లి వద్ద పొలాల నుంచి వచ్చే నీటితో పాటు వర్షపు నీళ్లు నిలుస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు పక్కనే పంట పొలాల్లో ఉండే నీళ్లు రోడ్డు పైకి వస్తున్నాయి. వర్షాల వల్ల కూడా వరద నీళ్లు వెళ్లేందుకు దారి లేక రోడ్డు పైనే నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి పక్కనే సిమెంట్‌తో కాలువలు నిర్మిస్తే వృథా నీరు అంతా.. మురుగుకాలువల్లోకి వెళ్తాయని ప్రజలు పేర్కొంటున్నారు. జాతీయ రహదారుల శాఖ అధికారులు చర్యలు తీసుకొని కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి : అమీర్ పాషా, నేషనల్ హైవేస్ డీఈ, మంచిర్యాల

ఫోన్ నంబర్ : 94408 18510

మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: మహిళా ఆరోగ్య వికాస్ ద్వారా వికాస తరంగిణి కార్యకర్తలతో జెట్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆస్ట్రేలియా మెల్బోర్న్ వారి సహకారంతో ఆదివారం పాతమంచిర్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్లు, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్లు రాకుండా ముందస్తుగా తెలుసుకునేందుకు ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు బయటకు చెప్పుకోలేని ఆరోగ్య సమస్యలు, నెలసరి సమస్యలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన వీఐఏ పరీక్షను జరిపి, కాల్పోస్కోప్ ద్వారా, వారి ఆరోగ్య పరిస్థితిని చూపించి, అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్యాన్సర్‌కు కారణమయ్యే ఇన్‌ఫెక్షన్లను ముందుగానే గుర్తించి, వాటిని మందుల ద్వారా తగ్గించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా 200మందికి పైగా మహిళకు స్క్రీనింగ్ పరీక్షలను చేశామని, వైద్యం అవసరమైన వారికి తగిన సలహాలు, సూచనలను ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నల్మాస్ శ్రీదేవి, డాక్టర్ నల్మాస్ శ్రీనివాస్, డాక్టర్ రాకేశ్ రెడ్డి, డాక్టర్ సుగుణాకర్ రెడ్డి, వికాస తరంగిణి సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు బాల్‌కిషన్‌రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హన్మంతరావు, కార్యదర్శి నర్సింగరావు, మహిళా ఆరోగ్య వికాస్ ఉమ, యువ వికాస్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణ, పాతమంచిర్యాల శాఖ కోఆర్డినేటర్ రాజేశ్వరి, గోనె శ్యాంసుందర్‌రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, మహిళలు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడిగా రాజం



రాజంను సన్మానిస్తున్న ఐక్యవేదిక శ్రేణులు

బెల్లంపల్లి: దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడిగా గోమాస రాజం ఎన్నికయ్యారు. ఈ నెల 13న నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాజంను అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు ఐక్యవేదిక నాయకులు ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన రాజంకు ఆదివారం శాలువా కప్పి నాయకులు ఘనంగా సన్మానం చేశారు. అంబేద్కర్ భవన్, ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం పాటు పడతానని రాజం ప్రకటించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు ,శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసమే కార్డెన్ సెర్చ్



మాట్లాడుతున్న వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య పక్కన రూరల్ సీఐ ,ఎస్సైలు

బెల్లంపల్లి: శాంతి భద్రతలు, ప్రజల రక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎస్.దేవయ్య అన్నారు. ఆదివారం తెల్లవారుజామున మున్సిపాలిటీలోని కన్నాల బస్తీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేశారు. అరవై మంది సీఐ, ఎస్సైలు, పోలీసులు సామూహికంగా బస్తీకి వచ్చి ఇంటింటా సోదాలు చేశారు. ఇళ్లలో ఉన్న వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకుని ఆధార్, గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ దేవయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నేరాల నియంత్రణ, ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని కొత్త చట్టాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆ చట్టాలపై ప్రజలు సరైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఎవరైన గుర్తు తెలియని కొత్త వ్యక్తులు సంచారం చేసినీ, షెల్టర్ తీసుకున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ధ్రువీకరణపత్రాలు లేని, నంబర్ ప్లేట్ లేని 45ద్విచక్ర వాహనాలను, 2ఆటోలను సీజ్ చేశారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, పలువురు ఎస్సైలు, స్పెషల్‌పార్టీ ఫోర్స్, పోలీసులు పాల్గొన్నారు.

పోడు భూముల్లో సాగుకు అనుమతించాలి



బండి సంజయ్‌ని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ

కోటపల్లి/చెన్నూర్: కోటపల్లి మండలంలోని ఎసన్‌వాయి, బోప్పారం, నాగంపేట తదితర గ్రామాల్లో అటవీఅధికారులు తమను పోడు వ్యవసాయం సాగు చేసుకోనివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్ బీజేపీ ఫ్లోర్ లీడర్ నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి, మండలకేంద్రంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు వెడల్పులో ఇళ్లు భూములు కోల్పోయిన వారికి ఇంతకు ముందు 100డబుల్ బెడ్‌రూంలు మంజూరు కాగా నేటికి నిర్మాణం జరగలేదని రాష్ట్ర ప్రభుత్వం నుంచి వంద ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని ఎంపీపీ మంత్రిసురేఖా ఆధ్వర్యంలో కేంద్ర హోం సహాయశాఖ మంత్రి బండిసంజయ్‌కు వినతిపత్రం వేర్వేరుగా అందజేశారు. వారం రోజుల్లో ఫారెస్టు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం ఉండటంతో కోటపల్లి మండల పోడుభూముల సమస్యలపై మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ హామీ ఇచ్చినట్లు ఎంపీపీ మంత్రిసురేఖా తెలిపారు. అనంతరం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దింటి పున్నం, పోడురైతులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్



కండువా కప్పుతున్న వెరబెల్లి రఘునాథ్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్‌ఎస్‌కు చెందిన 11వ వార్డు కౌన్సిలర్ గడ్డం సంపత్ ఆదివారం బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సమక్షంలో పార్టీలో చేరిన సంపత్‌కు కండువా కప్పి ఆహ్వానించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచిగా చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని జిల్లా షీటీమ్ ఎస్సై హైమ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర (షెడ్యూల్ కులాల) వస తి గృహంలో ఆదివారం విద్యార్థులకు షీ టీంపై అవగాహన కల్పించారు. ఆకతాయిల ఆటకట్టించి మహిళలకు రక్షణ కల్పించటమే షీ టీం కర్తవ్యమన్నారు.

విద్యారంగంలో సేవలకు సేవారత్న అవార్డు

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్ రవీంద్రభారతీలో తాజ్‌పౌండేషన్ ఆధ్వర్యంలో విద్యారంగంలో విశిష్ట సేవలందించినందుకు శనివారం మంచిర్యాలకు చెందిన పి.శ్రీనివాస్, శ్రీదేవిలకు సేవారత్న అవార్డులు అందజేశారు. కార్యక్రమానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకాగా సంస్థ చైర్మన్ సహరాభాను చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.